నెల్లూరు ప్రజల ఆశీస్సులు కోరుతున్నాం: కాకాణి



04



# అక్షర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

RNI: APTEL/26/A8235



అక్షర దర్శిని

దినపత్రికలో పని చేయడానికి అనుభవం కలిగిన, జర్నలిజంపై ఆసక్తి ఉన్న రిపోర్టర్లు కావలెను. కొత్త వారికి కూడా అవకాశం ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు

9912808090

8374168090



నెల్లూరు | సంపుటి - 1 | సంచిక -18 | శుక్రవారం16 అక్టోబర్ 2026 | ఎడిటర్: కడియాల చిన్నయరెడ్డి | పేజీలు : 4 | వెల : 2/-




## పొదలకూరు వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) ఖరారు

- విరువూరు మాజీ సర్పంచ్‌కు వైసీపీ నాయకత్వం అవకాశం
- ఖరారు చేసిన అధిష్టానం

**పొదలకూరు,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా పొదలకూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటీసీ అభ్యర్థిగా విరువూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) ఖరారయ్యారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పొదలకూరు జడ్పీటీసీ స్థానం నుంచి ఆయన వైసీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు.

మండలంలో పార్టీ బలోపేతం, స్థానిక రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని వైసీపీ నాయకత్వం బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని) అభ్యర్థిత్వాన్ని పార్టీ వర్గాలు ఖరారు చేశాయి . ఆయన అభ్యర్థిత్వంతో పొదలకూరు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఎంపిక, గ్రామాల వారీగా రాజకీయ సమీకరణాలపై ప్రధాన పార్టీల్లో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పొదలకూరు వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా బచ్చల సురేష్ కుమార్ రెడ్డి(చిన్ని)పేరు ఖరారు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# గజలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు..

### పెంచలకోనలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు..

### భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన..

**పెంచలకోన,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో కొలువుదీరిన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తులతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన గురువారం ఆదిలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మపీఠంపై ఆసీనులైన అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించడంతో ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ అనంతరం 10 గంటలకు స్నపన తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించిన శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారిని గజలక్ష్మి స్వరూపంలో పద్మపీఠంపై అధిష్ఠింపజేసి ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని ప్రధానార్చకులు, అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిపించారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు కుంకుమార్చనలో పాల్గొని భక్తితో పూజలు

...మిగతా 2లో




# స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట పోలీసు భద్రత

- జిల్లావ్యాప్తంగా 300 కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు.. 874 మందిపై బైండోవర్ చర్యలు
- 44 నామినేషన్ కేంద్రాల వద్ద 220 మంది పోలీసులతో బందోబస్తు
- ఎన్నికల భద్రతకు 1,500 మంది సిబ్బందితో ప్రణాళిక

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** జిల్లాలో త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపడుతోందని జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై నిఘాను ముమ్మరం చేసినట్లు వెల్లడించారు.ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 300 కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ

...మిగతా 4లో



04



## శ్రీ కన్యకాపరమేశ్వరి సేవలో సోమిరెడ్డి

### పొదలకూరులో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**పొదలకూరు,(అక్షర దర్శిని) :** శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గురువారం పొదలకూరులోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న సోమిరెడ్డికి అర్చకులు, ఆలయ నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా

...మిగతా 3లో



## కలువాయి వద్ద రెండు కార్లు ఢీ.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

▶▶ డివైడర్‌పైకి ఎక్కిన కారు.. ముందు భాగం నుజ్జునుజ్జు

**కలువాయి,(అక్షర దర్శిని):** నెల్లూరు జిల్లా కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి కూడలి వద్ద జాతీయ రహదారి 565పై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు కార్లు ఢీకొన్న ఈ ఘటనలో బద్వేల్ నుంచి తిరుపతికి వెళ్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వివరాల్లోకి వెళ్తే.. కడప జిల్లా బద్వేల్ నుంచి తిరుపతికి వెళ్తున్న కారును, అనంతసాగరం మండలం సంజీవనగరం నుంచి కలువాయి వైపు వస్తున్న మరో కారు వెంకటరెడ్డిపల్లి కూడలి వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు బద్వేల్ నుంచి వస్తున్న కారు అదుపుతప్పి రహదారి మధ్యలోని డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో కారులో ఇద్దరు ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. అయితే కారు నెమ్మదిగా వెళుతుండటంతో పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిపై ఒక్కసారిగా జరిగిన ఈ ఘటనతో అటుగా ప్రయాణిస్తున్న వాహనదారులు ఉలిక్కిపడ్డారు.

## ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనపై రూ.4.40 లక్షల జరిమానా

▶▶ ఐస్‌క్రీమ్, పాలు, జ్యూస్ సెంటర్లు, సూపర్ మార్కెట్లపై చర్యలు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై నెల్లూరు జిల్లా అధికారులు చర్యలు చేపట్టారు. ఫుడ్ సేఫ్టీ శాఖ నమోదు చేసిన వివిధ కేసులను విచారించిన జాయింట్ కలెక్టర్ మొత్తం రూ.4.40 లక్షల జరిమానా విధించినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. నెల్లూరులో ఐస్‌క్రీమ్‌లో నిర్దేశిత ఫ్యాట్ శాతం లేకపోవడంతో సంబంధిత వ్యాపారులకు రూ.85 వేలు, పాలలో ఫ్యాట్ శాతం తక్కువగా ఉన్న కేసుల్లో పాల సేకరణదారులు, చిల్లింగ్ సెంటర్ల నిర్వాహకులకు రూ.1.35 లక్షలు జరిమానా విధించారు. నాణ్యత లేని పండ్లు, పారిశ్రామిక ఐస్‌ను ఉపయోగించిన జ్యూస్ సెంటర్లకు రూ.60 వేలు, ఆహార భద్రతా లైసెన్సు నిబంధనల ఉల్లంఘనకు రూ.40 వేలు జరిమానా విధించారు. అలాగే గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయిస్తున్న డార్క్ స్టోర్లు, సూపర్ మార్కెట్లకు రూ.75 వేలు, వంటగది పరిశుభ్రత పాటించని రెస్టారెంట్లు, దాబాలకు రూ.30 వేలు, ప్యాక్ చేసిన ఆహార పదార్థాలపై లేబుల్ వివరాలు సక్రమంగా లేని కేసులో రూ.15 వేలు జరిమానా విధించారు. ఆహార వ్యాపారులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలు పాటించాలని, నాణ్యమైన ముడి పదార్థాలను వినియోగించాలని అధికారులు సూచించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించరాదని, వంటగదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్యాకేజ్డ్ ఆహారంపై అవసరమైన లేబుల్ వివరాలు ఉండాలని స్పష్టం చేశారు. అపరిశుభ్ర వంటగదులు ఉన్న ఆహార విక్రయశాలలను మూసివేసి, నిబంధనల ప్రకారం అనుమతి పొందిన తర్వాతే తిరిగి ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జి. వెంకటేశ్వరరావు, ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎం. ప్రణుతి ఫ్లోరా, డి. నీరజ పాల్గొన్నారు.

## మహిళా రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన









▶▶ ఉత్తమ మహిళా రైతులకు శాలువాలు, జ్ఞాపికలతో సన్మానం

**పొదలకూరు,(అక్షర దర్శిని):** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం పొదలకూరు రైతు సేవా కేంద్రంలో మహిళా రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగంలో ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రాధాన్యతపై అధికారులు మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శివనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పశుసంవర్ధక శాఖ ఏడీఏ అరుణ, వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త హసీనా బాను, మండల వ్యవసాయ అధికారులు వి. ప్రతాప్, సోము సుందర్, వెంకటేశ్వర్లు, ఉద్యానవన అధికారి ఆనంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ మహిళా రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయం, పశుసంవర్ధకం, ఉద్యానవన రంగాల్లో మహిళల భాగస్వామ్యం గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. అనంతరం వ్యవసాయ రంగంలో విశేష కృషి చేస్తున్న ఉత్తమ మహిళా రైతులను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించి అభినందించారు. మహిళా రైతుల సేవలను గుర్తించి, వారిని మరింత ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంలో భద్రతా చర్యల పరిశీలన



▶▶ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలి: అధికారులు





**నెల్లూరు,(అక్షర దర్శిని):** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నెల్లూరు నగరంలోని ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాంను గురువారం అధికారులు తనిఖీ చేశారు. రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ఈవీఎం నోడల్ అధికారి ఎస్. ఆంజనేయులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలిసి ఈ తనిఖీలో పాల్గొన్నారు. ఈవీఎం గోదాం నెలవారీ తనిఖీల్లో భాగంగా గోదాంలకు వేసిన సీల్స్, సీసీ కెమెరాల పనితీరుతో పాటు భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈవీఎం గోదాం వద్ద భద్రతా చర్యల అమలులో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో డీఆర్వో విజయ్ కుమార్, ఆర్డీవో అనూష తదితర అధికారులు పాల్గొన్నారు.

# గజలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు..





**మొదటి పేజీ తరువాయి**

నిర్వహించారు. వేదమంత్రాల నాదం, మంగళవాయిద్యాల ధ్వనులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో పరవశించింది.

**నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం**

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు వాస్తవ్యులు త్రోవగుంట సుమతీదేవి, లక్ష్మీ నరసయ్య దంపతులు తమ కుమారులు కీ.శే. త్రోవగుంట గిరీష్ నాథ్, కీ.శే. పెంచలబాబు జ్ఞాపకార్థం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. విరాళదాతలకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం అనంతరం శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. భక్తులకు అన్నప్రసాద సేవ అందించాలనే సత్సంకల్పంతో దివంగతుల జ్ఞాపకార్థం విరాళాలు సమర్పించడం పట్ల ఆలయ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.
పెంచలకోనలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తుల ఆధ్యాత్మిక భావనలకు వేదికగా నిలుస్తున్నాయి.



అమ్మవారి దివ్యమంగళ స్వరూపాన్ని దర్శించుకుంటూ భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందుతున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి






**ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ హిమాన్ను శుక్లా పరిశీలన**

**కోవూరు,(అక్షర దర్శిని):** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా అధికారులను ఆదేశించారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు.కోవూరు సమీపంలోని జీవనజ్యోతి జూనియర్ కళాశాలలో ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, విడవలూరు, కొడవలూరు మండలాలకు సంబంధించి ఏర్పాటు చేయనున్న రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల గదులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడింగ్ పక్కాగా ఏర్పాటు చేయాలని, భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఎన్నికల సిబ్బంది రాకపోకలు, పోలింగ్ సామగ్రి తరలింపు, వాహనాల రాకపోకలు, పార్కింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లన్నింటినీ నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ పరిశీలనలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో బ్రహ్మయ్య, నెల్లూరు, కావలి ఆర్డీవోలు అనూష, ఎలీషా బాబు, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు




**శక్తి యాప్, ఆపరేషన్ చిన్నారి తల్లి, ఆపరేషన్ దండాయన్‌పై విస్తృత ప్రచారం**

**నెల్లూరు,(అక్షర దర్శిని):** మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) శ్రీమతి సీహెచ్ సౌజన్య సూచనలతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో శక్తి బృందాలు ప్రజలకు భద్రతా చర్యలపై అవగాహన కల్పిస్తున్నాయి.నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు సబ్ డివిజన్, గూడూరు, కావలి ప్రాంతాల్లో శక్తి బృందాలు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, ఇతర ప్రజా ప్రదేశాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. మహిళలు, విద్యార్థినులు, తల్లిదండ్రులు, ప్రజలకు శక్తి యాప్ వినియోగం, మహిళలు, చిన్నారుల రక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాయి.

**ఆపద సమయంలో శక్తి యాప్‌తో పోలీసుల సహాయం**

శక్తి యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకునే విధానం, అందులోని భద్రతా ఫీచర్లు, అత్యవసర పరిస్థితుల్లో యాప్‌ను వినియోగించే పద్ధతులను శక్తి బృందాలు వివరిస్తున్నాయి. ఆపద సమయంలో యాప్ ద్వారా పోలీసులను సంప్రదించి సహాయం పొందవచ్చని తెలియజేస్తూ, మహిళలు, బాలికలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నాయి.

**చిన్నారుల రక్షణపై ప్రత్యేక దృష్టి**

బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, మానవ అక్రమ రవాణా నిరోధం, పోక్సో చట్టం అమలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారులపై జరిగే నేరాలను గుర్తించడం, వాటిని అరికట్టేందుకు అప్రమత్తంగా ఉండటం, అవసరమైన సమయంలో సంబంధిత అధికారులకు సమాచారం అందించడం వంటి అంశాలను వివరిస్తున్నారు.“చిన్నారుల రక్షణ కుటుంబ బాధ్యత మాత్రమే కాదు.. సమాజం మొత్తం బాధ్యత” అనే సందేశంతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నారు. మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రత కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

**అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు**

అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సహాయం కోసం 112, చిన్నారుల రక్షణ, సహాయం కోసం 1098, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్ నంబర్లను వినియోగించాలని పోలీసులు సూచించారు.
మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు జిల్లా పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎస్పీ డా. అజిత వెజెండ్ల తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసు శాఖ అందిస్తున్న భద్రతా సేవలు, సాంకేతిక సదుపాయాలను వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు.

# శ్రీ కన్యకాపరమేశ్వరి సేవలో సోమిరెడ్డి

**మొదటి పేజీ తరువాయి**

స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేను సత్కరించారు.శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని సోమిరెడ్డి ఆకాంక్షించారు. శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న నేపథ్యంలో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.





# తెగచెర్లలో పోలీసుల విస్తృత తనిఖీలు

**120 ఇళ్ల తనిఖీ.. ఆధార పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాల స్వాధీనం**

**ఎన్నికల భద్రత, నేరాల నియంత్రణపై గ్రామస్తులకు అవగాహన**

**రాపూరు,(అక్షర దర్శిని):** జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం రాపూరు మండలం తేగచెర్ల గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.రాపూరు సీఐ ఆధ్వర్యంలో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో రాపూరు ఎస్ఐ, సైదాపురం ఎస్ఐతో పాటు 20 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, సుమారు 120 ఇళ్లను పరిశీలించారు. ఈ క్రమంలో సరైన ఆధార పత్రాలు లేని 32 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకుని పరిశీలనలో ఉంచారు.

**ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండాలి**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని పోలీసులు సూచించారు. ఎన్నికల సమయంలో ఘర్షణలకు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఆపరేషన్ త్రిశూల్‌పై ప్రచారం**

ఆపరేషన్ త్రిశూల్ లక్ష్యాలు, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాల్సిన ఆవశ్యకతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.
జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసు శాఖ వెల్లడించింది. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని స్పష్టం చేసింది.

# దుత్తలూరు అటవీ ప్రాంతంలో గంజాయి సాగు కలకలం

**నందిపాడు వెళ్లే మార్గంలో గంజాయి సాగు గుర్తింపు**

**ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు**



**దుత్తలూరు,(అక్షర దర్శిని)** : దుత్తలూరు మండలంలోని అటవీ ప్రాంతంలో గంజాయి సాగు వెలుగులోకి రావడం కలకలం రేపింది. నందిపాడు వెళ్లే మార్గంలో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించిన పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టారు.
విశ్వసనీయ సమాచారం మేరకు రంగంలోకి దిగిన స్పెషల్ పార్టీ అధికారులు, పోలీసులు అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ క్రమంలో గంజాయి సాగును గుర్తించి, ఈ వ్యవహారానికి సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న వారిని పోలీసులు విచారిస్తున్నారు. గంజాయి సాగుకు సంబంధించిన పూర్తి వివరాలు, దీని వెనుక ఎవరైనా ఉన్నారా, ఇతర ప్రాంతాలకు గంజాయిని తరలిస్తున్నారా అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం. పోలీసుల విచారణ అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

**దుత్తలూరులో అక్రమ గంజాయి సాగుపై ఎస్పీ ప్రెస్‌మీట్**

-రేపు ఉదయం 7 గంటలకు ఎన్‌హెచ్-565 వెలిగొండ కాలువ క్రాస్ వద్ద మీడియా సమావేశం

నెల్లూరు జిల్లా దుత్తలూరు మండల పరిధిలో వెలుగుచూసిన అక్రమ గంజాయి సాగుకు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఐపీఎస్ శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు.అక్టోబర్ 16వ తేదీ ఉదయం 7 గంటలకు దుత్తలూరు--చింతకుంట ఎన్‌హెచ్-565 మార్గంలోని వెలిగొండ కాలువ క్రాస్ వద్ద ఈ మీడియా సమావేశం జరగనుంది. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయం మీడియా ప్రతినిధులకు సమాచారం అందించింది.అక్రమ గంజాయి సాగుకు సంబంధించి పోలీసులు చేపట్టిన చర్యలు, దర్యాప్తులో వెల్లడైన వివరాలను ఎస్పీ ఈ సందర్భంగా వెల్లడించే అవకాశం ఉంది. ఈ సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు హాజరై వార్తలను కవర్ చేయాలని పోలీసు శాఖ కోరింది.

**మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక బస్సు** దుత్తలూరులో జరిగే ప్రెస్‌మీట్‌కు వెళ్లేందుకు మీడియా ప్రతినిధుల సౌకర్యార్థం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపింది. మీడియా మిత్రులు సకాలంలో చేరుకుని ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసింది.





## బీద రవిచంద్ర నివాసంలో బీజేపీ నేతల సమావేశం

▶▶ స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చ

**నెల్లూరు,(అక్షర దర్శిని):** నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర నివాసంలో బీజేపీ నేతలు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల పరిశీలకుడు దూండి రాకేష్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నేత రఘు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన అంశాలపై నేతలు చర్చించారు. ఎన్నికల నేపథ్యంలో పార్టీలు అనుసరించాల్సిన వ్యూహాలు, సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పటిష్ట పోలీసు భద్రత

**మొదటి పేజీ తరువాయి**

తనిఖీల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలను పరిశీలించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్నవారిని గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

**874 మందిపై బైండోవర్ చర్యలు** ఎన్నికల సమయంలో ఘర్షణలు, ఇతర అవాంఛనీయ ఘటనలను నివారించేందుకు ఈ నెల 14వ తేదీ నాటికి జిల్లావ్యాప్తంగా 874 మందిపై బైండోవర్ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ వెల్లడించారు. గతంలో ఎన్నికల సమయంలో ఘర్షణలకు పాల్పడినవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

**44 నామినేషన్ కేంద్రాల వద్ద బందోబస్తు** జిల్లాలోని 44 నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా విధుల నిర్వహణకు 220 మంది పోలీసు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. నెల్లూరు టౌన్ కార్పొరేషన్ పరిధిలో 20, ఆత్మకూరు పరిధిలో 13, బుచ్చిరెడ్డిపాళెం పరిధిలో 11 నామినేషన్ కేంద్రాలు ఉన్నట్లు వివరించారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా, అభ్యర్థులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తు, పర్యవేక్షణ చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

**ఎన్నికల విధులకు 1,500 మంది పోలీసులు** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా సుమారు 1,500 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, పరిస్థితులకు అనుగుణంగా అదనపు బలగాలను మోహరించనున్నట్లు వెల్లడించారు. నిరంతర గస్తీ, వాహన తనిఖీలు, అనుమానితుల కదలికలపై నిఘా వంటి చర్యలను మరింత ముమ్మరం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**ఎన్నికల నియమావళిని పాటించాలి** ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. బెదిరింపులకు పాల్పడటం, గొడవలు సృష్టించడం, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలను సహించబోమని, బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వదంతులను నమ్మకుండా, ఎన్నికల సమయంలో శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు పోలీసు శాఖకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల భద్రత, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణే జిల్లా పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని ఎస్పీ డా. అజిత వెజెండ్ల స్పష్టం చేశారు.

## వేదాయపాలెంలో పోలీసుల విస్తృత తనిఖీలు





▶▶ టైలర్స్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్.. 14 ద్విచక్ర వాహనాలు, ఆటో గుర్తింపు

**నెల్లూరు,(అక్షర దర్శిని):** జిల్లాలో నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల భద్రతను పటిష్టం చేసే లక్ష్యంతో జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తోంది. జిల్లా ఎస్పీ డా. అజిత వెజెండ్ల, ఐపీఎస్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం వేదాయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని టైలర్స్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు 15 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాలనీలోని ఇళ్ల పరిసరాలు, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

**ఆధార పత్రాలు లేని వాహనాల గుర్తింపు**

ఈ తనిఖీల్లో సరైన ఆధార పత్రాలు లేని 14 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు గుర్తించారు. ఆయా వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, యాజమాన్య వివరాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

**ఆపరేషన్ త్రిశూల్‌పై అవగాహన**

తనిఖీల సందర్భంగా స్థానికులకు నేరాల నివారణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ఆపరేషన్ త్రిశూల్ లక్ష్యాలపై పోలీసులు అవగాహన కల్పించారు. కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో సహకరించాలని సూచించారు.

**నిరంతరం ప్రత్యేక తనిఖీలు**

జిల్లాలో నేరాల నియంత్రణ, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించేందుకు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతాయని పోలీసు శాఖ వెల్లడించింది. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్, యాజమాన్య పత్రాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

## నెల్లూరు వైసీపీలోకి 400 కుటుంబాల చేరిక





▶▶ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు, అనుచరులు

▶▶ చేరిన వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తాం: ఎమ్మెల్సీ

**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగర నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 400 కుటుంబాలు చేరినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. నెల్లూరులోని వైసీపీ సిటీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఈ చేరికల కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకుడు ముజీర్, ఆయన సతీమణి, 54వ డివిజన్ కార్పొరేటర్ షఫీయా బేగంతో పాటు వారి అనుచరులు సుమారు 300 కుటుంబాలు, టీడీపీకి చెందిన యలమందరెడ్డి అనుచరులు మరో 100 కుటుంబాలు వైసీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

**చేరికలతో వైసీపీకి ప్రజాదరణ పెరుగుతోంది: కాకాణి** ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి పరాభవం తప్పదని ఆయన వ్యాఖ్యానించారు.

**చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తాం: ఎమ్మెల్సీ** ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అధికార టీడీపీ నుంచి 400 కుటుంబాలు వైసీపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో అసంతృప్తి ఉందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో నెల్లూరు నగరంతో పాటు రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల్లోనూ వైసీపీ విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో పార్టీలో చేరుతున్న వారికి రాబోయే రోజుల్లో సముచిత ప్రాధాన్యత, గౌరవం కల్పిస్తామని తెలిపారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పెర్నాటి కోటేశ్వరరెడ్డి, 14వ డివిజన్ ఇన్‌చార్జి గిరిరెడ్డి, 53వ డివిజన్ ఇన్‌చార్జి వెంగళరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెల్లూరు ప్రజల ఆశీస్సులు కోరుతున్నాం: కాకాణి

▶▶ వైసీపీలోకి 400 కుటుంబాల చేరిక..

**ఆనం విజయకుమార్‌రెడ్డికి మద్దతివ్వాలని పిలుపు**



**నెల్లూరు,(అక్షర దర్శిని) :** నెల్లూరు నగర మేయర్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి విజయం సాధించేందుకు నగర ప్రజల ఆశీస్సులు కోరుతున్నామని మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయంలో గురువారం నిర్వహించిన పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీకి చెందిన నాయకులు, వారి అనుచరులతో కలిపి మొత్తం 400 కుటుంబాలు వైసీపీలో చేరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

**నగర అభివృద్ధి కుంటుపడింది** ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ గత 28 నెలల్లో నెల్లూరు నగరంలో అభివృద్ధి కుంటుపడిందని, అవినీతి, అక్రమ వసూళ్లు పెరిగాయని ఆరోపించారు. పన్నుల వసూళ్ల పేరుతో పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నీటి కనెక్షన్లు తొలగించడం, డ్రైనేజీ సేవలను నిలిపివేయడం వంటి చర్యలతో ప్రజలను వేధిస్తున్నారని విమర్శించారు. కూటమి నాయకులు అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రస్తుత పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత తగ్గిందని విమర్శించారు. నెల్లూరు నగర మేయర్ అభ్యర్థిగా ఆనం విజయకుమార్‌రెడ్డిని ఎంపిక చేయడం నగరంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ప్రత్యేక అభిమానానికి నిదర్శనమని కాకాణి అన్నారు. ఆనం విజయకుమార్‌రెడ్డికి అవకాశం కల్పిస్తే 72 మంది కార్పొరేటర్లతో కలిసి నగర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించి నెల్లూరు మేయర్ స్థానాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా అందించాలని ప్రజలను కోరారు. నగర అభివృద్ధికి ఎవరు కృషి చేస్తారో ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. టీడీపీ ఇంకా మేయర్ అభ్యర్థి ఎంపికలో స్పష్టతకు రాలేదని కాకాణి విమర్శించారు. వైసీపీ మాత్రం ముందుగానే అభ్యర్థిని ప్రకటించి ఎన్నికలకు సిద్ధమైందని పేర్కొన్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలపై పోరాడుతూ వారి గొంతుకగా నిలిచామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ అభ్యర్థి ఆనం విజయకుమార్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Publisher, Editor & Owned by: KADIYALA CHINMAYA REDDY, Thatiparthi Village, Podalakur Mandal, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524309. Printed by: VIJAYA GRAPHICS, D.No. 26-3-1993. Chandramouli Nagar, 1st Steet Veda Yapalem, Sri Potti Sreeramulu Nellore, Andhra Pradesh 524004.